సాక్షి విశాఖపట్నం

సోమవారం, 4, ఆగస్టు, 2025



స్నేహితుల దినోత్సవం.. పైగా ఆదివారం. ఇంకేముంది అందాల సాగరతీరం.. స్నేహితుల తీరంగా మారిపోయింది. శుభాకాంక్షల వెల్లువలు.. కేక్ కటింగ్‌లు.. ఆటపాటలు.. సముద్ర స్నానాలు.. సెల్ఫీలు.. వాట్సాప్ షేరింగ్‌లు.. ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్స్.. ఒకటే ముచ్చట్లతో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపారు. అలల వయ్యారాలు.. యువత కేరింతలతో సాగరతీరంలో సందడి నెలకొంది. బీచ్‌రోడ్డులోని కొన్ని హోటళ్లలో కార్నీవాల్ తరహాలో 'దోస్తీవాల్' వేడుకలు జరగ్గా.. ఇంకొన్ని హోటళ్లలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు సంబరంగా జరుపుకున్నారు.



సాగరతీరంలో జనాల సందడి



స్నే హ తీ ర ం







ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అడ్డగోలు జీవోలు.. అణచివేతకు కుట్రలు!

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వానికి భయం మొదలైంది
- పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను నిషేధిస్తూ ఇచ్చిన జీవో ప్రజాస్వామ్య విరుద్ధం
- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగిన ఏఐఎస్ఎఫ్



నిరసన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వానికి ఏడాది కాలంలోనే భయం మొదలైందని అందుకు నిదర్శనమే పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్ అన్నారు. ఆదివారం విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లోకి ప్రవేశం లేదని జీవో విడుదల చేయడాన్ని ఖండించారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పాఠశాలల్లోకి అనుమతించకపోవడం కూటమి నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం అడ్డగోలుగా జీవోలు ఇస్తూ అణచివేతకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా విద్యార్థులకు అండగా ఉంటామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి అభిషేక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అరకు ఇక రాయగడకే!

ఆదాయాన్నిచ్చే కొరాపుట్ మార్గం కూడా రాయగడ పరిధిలోకి..

అరకు కోసం వినతులిచ్చినా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

వాల్తేరు నుంచి కొత్త డివిజన్‌లో చేర్చిన రైల్వే బోర్డు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రా ఊటీ అరకు ఇప్పుడు రాయగడ పరమైపోయింది. వాల్తేరు రైల్వే డివిజన్‌లో భాగంగా ఉన్న అరకు.. జోన్ విభజన తర్వాత కొత్త డివిజన్‌లో చేరుతోంది. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌లో కొంత, విశాఖ డివిజన్‌లో మరికొంత భాగాన్ని విలీనం చేయాలన్న తుది డీపీఆర్‌కూ బోర్డు ఆమోద ముద్ర వేసేసింది. ఇక గెజిట్ వచ్చేస్తే.. చారిత్రక వాల్తేరు కనుమరుగుకు.. అరకు ప్రాంతం రాయగడకు ఇక అధికారికంగా రాజముద్ర పడిపోయినట్లే. ఆదాయాన్నిచ్చే అరకు, కొరాపుట్ మార్గాలను విశాఖ డివిజన్‌లో ఉంచాలన్న వినతులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రకు రిక్తహస్తాలు చూపించింది.

వాల్తేరు డివిజన్‌ను విడదీసేసి..

రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన తథ్యం అన్నట్లుగా రైల్వే బోర్డు ముందుగానే సంకేతాలిచ్చింది. ఇందులో భాగంగా వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవలే వైజాగ్ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు ప్రధాని శంకు స్థాపన చేశారు. ఇటీవలే మార్పులు చేసిన డీపీఆర్‌ని కూడా బోర్డు ఆమోదించేసింది. వాల్తేరును కొనసాగించాలని ఒత్తిడి తీసుకొచ్చినా దాన్ని పెడచెవిన పెట్టేసింది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త డివిజన్‌కు డీపీఆర్‌లో స్పష్టం చేసింది.

410 చ.కి.మీ మేర విశాఖ డివిజన్

సరిహద్దుల విషయంలో బోర్డు కఠినంగా వ్యవహరించింది. గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు గుణుపూర్- పర్లాఖిముండి సెక్షన్ సహా, నౌపడ-గుణుపూర్ లైన్‌ని కొత్తగా ఏర్పాటవుతున్న విశాఖ డివిజన్‌లో ఉంచాలని ప్రతిపాదించారు. కానీ దీన్ని బోర్డు అంగీకరించలేదు. సుమారు 410 చ.కి.మీ మేర విశాఖపట్నం డివిజన్‌గా ఏర్పాటు కానుంది. వాల్తేరులోని మిగిలిన భాగమైన కొత్తవలస నుంచి కిరండూల్, కూనేరు-తెరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్ నుంచి కొరాపుట్ జంక్షన్, పర్లాఖిముండి నుంచి గుణుపూర్ వరకూ దాదాపు 680 కి.మీ మేర రాయగడ డివిజన్ పరిధిలోకి రాబోతోంది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపంలోని కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉన్నాయి. అరకు, కోరాపుట్ లైన్ విశాఖ డివిజన్‌కు ఇవ్వాలని ఎన్ని ప్రతిపాదనలు పంపించినా కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసేసింది.



గెజిట్ వచ్చేలోపైనా కూటమి కళ్లు తెరిస్తేనే..!

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా, ఇందులో రూ.8 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షలు వస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12-14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే 260 డీజిల్ ఇంజన్లున్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లుండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్ విశాఖ. ఇందులో సింహభాగం ఆదాయం ఐరెన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. ఇదంతా రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. వాల్తేరుకు రావాల్సిన ఆదాయం దాదాపు సింహభాగం కోల్పోయినట్లే అవుతుంది. జోన్‌కు సంబంధించి ఇంకా గెజిట్ విడుదల కాలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఎంపీలు పట్టుబట్టి.. కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే విశాఖ డివిజన్‌కు మంచి జరిగే అవకాశం ఉంది. కానీ.. కూటమి నేతలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

ఫిరాయింపు కార్పొరేటర్లపై వేటు వేయాల్సిందే..



స్థాయీ సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తున్న కార్పొరేటర్లతో సమావేశమైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు. చిత్రంలో డిప్యూటీ మేయర్ సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాల్సిందేనని ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు డిమాండ్ చేశారు. ఫిరాయింపు కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌పై సోమవారం తీర్పు వెలువడనుంది. కాగా.. ఈ నెల 6న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికపై ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కె.కె.రాజు సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే కార్పొరేటర్లకు ఎన్నికలో గెలుపునకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లు వేరొక పార్టీలోకి ఫిరాయిస్తే అది ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించినట్లవుతుందన్నారు. 'మా పార్టీ నుంచి ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్లపై అనర్హత వేటు అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. తీర్పు వెలువడితే వారి రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారనుంది. ఇలా ఫిరాయింపుదారులపై వేటు పడితేనే భవిష్యత్తులో ఎవరూ ఫిరాయించరు. ఒకవేళ ఫిరాయింపులకు పాల్పడాలనుకుంటే రాజీనామా చేసి, ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచి వెళ్లాలి.' అని అన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటు హక్కును రద్దు చేయాలి

వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు నిర్ణయం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని డిప్యూటీ మేయర్ కె.సతీష్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్ ప్రశ్నించారు. తక్షణమే ఆ కార్పొరేటర్ల ఓటు హక్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించినప్పుడు ఆ పదవిని రద్దు చేసే అధికారం చట్టబద్ధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలోకి ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్ల అనర్హత అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఆ 27 మంది ఫిరాయింపు కార్పొరేటర్లకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఇప్పటికే నోటీసులు కూడా పంపించారని గుర్తు చేశారు. న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగా వారికి ఓటు హక్కు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని, ఒకవేళ ఎన్నిక నిర్వహించినా అది చెల్లదని హెచ్చరించారు.

అప్రజాస్వామికంగా మేయర్ ఎన్నిక

పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లతో అప్రజాస్వామికంగా కొత్త మేయర్‌ను ఎన్నుకున్నారని వారు ఆరోపించారు. కొత్త మేయర్ బాధ్యతలు స్వీకరించి వంద రోజులు కాకముందే ఆయన పనితీరు, అక్రమాలపై నగర ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. గత మేయర్ పాలనే బాగుందని నగర ప్రజలు భావిస్తున్నారన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో ఉన్న కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, సాడి పద్మారెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి రామచంద్రరావు, నక్కిల లక్ష్మి, కె.వి.శశికళ, కోడిగుడ్ల పూర్ణిమ, పల్లా అప్పలకొండ, బిపిన్ కుమార్ జైన్, గుండాపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె గర్భం.. అడ్డగోలు దందా

దోపిడీ కేంద్రాలుగా ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలు

మహారాణిపేట: సంతానం కోసం పరితపించే దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని నగరంలోని కొన్ని ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నాయన్న ఆరోపణలు నిజమవుతున్నాయి. సృష్టి ఐవీఎఫ్ సెంటర్‌లో అక్రమాలు వెలుగుచూసిన నేపథ్యంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన నాలుగు ప్రత్యేక బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.

జిల్లాలో మొత్తం 53 సంతాన సాఫల్య కేంద్రాలు (44 ఐవీఎఫ్, 9 సరోగసీ) ఉన్నాయి. వివాహమై ఏళ్లు గడిచినా మాతృత్వానికి నోచుకోలేదన్న బాధతో ఉన్న మహిళలే ఈ కేంద్రాల లక్ష్యం. పిల్లలు లేరన్న బాధ నుంచి దూరం చేయడం కోసం ఈ సెంటర్లు అక్రమాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో డాక్టర్ ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ లూసీ వంటి అధికారులతో కూడిన నాలుగు బృందాలు ఈ సెంటర్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో ఈ తనిఖీలు పూర్తికానున్నాయి.

తనిఖీల్లో విస్తుపోయే నిజాలు

- పిల్లల కోసం వచ్చే దంపతుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు నగదు రూపంలో వసూలు చేస్తున్నారు. ఈ భారీ మొత్తాలకు ఎలాంటి రశీదులు ఇవ్వకపోవడం, అకౌంట్లలో నమోదు చేయకపోవడం వంటి ఆర్థిక అవకతవకలను గుర్తించారు.
- సెంటర్‌కు వచ్చే దంపతులు ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిచోటా సీసీ కెమెరాలు, ప్రత్యేక సిబ్బందిని నియమించి.. ఒక రోగి వివరాలు మరో రోగికి తెలియకుండా అత్యంత రహస్యం పాటిస్తున్నారు. దీని వల్ల ఒకరి నుంచి ఎంత వసూలు చేస్తున్నారో మరొకరికి తెలిసే అవకాశం లేకుండా పోతోంది.
- నూరు శాతం గ్యారెంటీ, లేదంటే డబ్బులు వాపస్ వంటి మోసపూరిత ప్రకటనలతో పిల్లలు లేరన్న తీవ్రమైన మానసిక వేదనలో ఉన్న తల్లిదండ్రులను ఆకర్షించి, వారి బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. సరోగసీ, ఐవీఎఫ్ పేర్లతో ఈ కేంద్రాలు సాగిస్తున్న నిలువు దోపిడీపై పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఈ తనిఖీలు పూర్తయితే ఇంకెన్ని అక్రమాలు బయటపడతాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



గతంలో ఇక్కడే సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నడిచింది

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రశీదు తీసుకురావాలన్నారు. అర్జీదారులు తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి కాల్ సెంటర్ 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు.

కేజీహెచ్‌కు అనారోగ్యం

- వైద్యం కోసం వస్తే.. రోగులకు వ్యథలే..
- అధికారుల మధ్య ఆధిపత్య పోరు
- ఓ పరిపాలనాధికారి పనితీరుపై విమర్శలు
- అవినీతి, వర్గ విభేదాలు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు





వివిధ పరీక్షల కోసం బారులుదీరిన రోగులు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) సమస్యల వలయంలో చిక్కుకుంది. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అలాగే ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. అయితే పెరిగిన రోగుల తాకిడికి అనుగుణంగా వైద్య సేవలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాలనా వైఫల్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఆసుపత్రిలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ఆసుపత్రిలో 1,187 పడకలు ఉండగా, సోమవారం నుంచి శనివారం వరకు రోజూ 1,500 నుంచి 2,200 మంది ఓపీ టికెట్లు తీసుకుంటున్నారు. వీరిలో 300 నుంచి 600 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వార్డులు, పడకల సంఖ్యను పెంచాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు శూన్యం. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా యాజమాన్యం విఫలమవుతోంది. కొన్ని చోట్ల రోగులు కుక్కలతో కలిసి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా క్యాజువాలిటీ

ఆసుపత్రికి గుండెకాయ లాంటి క్యాజువాలిటీ విభాగం నిర్లక్ష్యానికి నిలయంగా మారింది. రోడ్డు ప్రమాద బాధితులు, అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైనవారు ఇక్కడికి వస్తే, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. క్షతగాత్రులు, రోగులను లోపలికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్, వీల్ చైర్ కోసం కూడా బంధువులే వెతుక్కోవాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. దీంతో క్షతగాత్రులు రక్తం కారుతూ.. బాధను ఓర్చుకుంటూ ఆటోల్లో, అంబులెన్స్‌ల్లో అప్పటి వరకు ఉండాల్సిన పరిస్థితి ఉంది. సిబ్బంది నిర్లక్ష్యం, విసుగు ప్రదర్శిస్తుండటంతో అత్యంత విలువైన 'గోల్డెన్ అవర్' వృథా అయి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. ఒకవేళ రోగి మరణిస్తే, మృతదేహాన్ని గంటల తరబడి అక్కడే స్ట్రెచర్‌పై వదిలేస్తున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి.

దుర్గంధభరితంగా వార్డులు

పారిశుధ్య పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో ఆసుపత్రిలోని అనేక వార్డులు కంపుకొడుతున్నాయి. రాజేంద్రప్రసాద్ వార్డు, భావనగర్ వార్డు, గైనిక్ వార్డు, పిల్లల వార్డు, ఆర్థోపెడిక్ వార్డుల్లో మరుగుదొడ్ల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. ఎవరైనా పర్యవేక్షణ చేస్తారంటే శుభ్రం చేస్తారు. లేదంటే పట్టించుకోరు. దీంతో అపరిశుభ్ర వాతావరణంలోనే రోగులు, వారి బంధువులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

ఆధిపత్య పోరు.. అవినీతి ఆరోపణలు

ఆసుపత్రిలో అధికారుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఆసుపత్రిని పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ తన చాంబర్ నుంచి బయటకు రావడం గగనంలా మారింది. విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎవరికీ అప్పగించలేదు. అడ్మినిస్ట్రేటర్‌గా వచ్చిన ఓ అధికారి పనితీరు మీద విమర్శలు వస్తున్నాయి. పరిపాలనను పట్టించుకోకుండా ఆస్పత్రిలో ఒక వర్గాన్ని చేతిలో పెట్టుకుని వివాదాలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి, వర్గ విభేదాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉండటంతో పాలన గాడి తప్పింది. తరచూ విద్యుత్ అంతరాయాలు, పనిచేయని ఏసీలు, ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ లోపాలు, పారిశుధ్య సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారు. ఆస్పత్రికి 'నేనే బాస్' అంటే 'నేనే బాస్'అనే ధోరణిలో అధికారుల మధ్య నెలకొన్న పోరుతో ఇక్కడ వైద్య సేవలు, పరిపాలన అస్తవ్యస్తంగా మారాయి.



వైద్యం కోసం గంటల తరబడి నిరీక్షణ

కష్టపడి ఓపీ టికెట్టు సంపాదించి సంబంధిత విభాగానికి వెళ్తే.. వైద్యుడిని సంప్రదించడానికి గంటకు పైగా సమయం పడుతోంది. క్యాజువాలిటీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, ప్రసూతి, చిన్నపిల్లల వార్డు, క్రిటికల్ కేర్ విభాగం .. ఇలా ప్రతి విభాగంలోనూ వందలాది మంది రోగులు బారులుదీరి ఉంటారు. రోగులకు వైద్యం బాగానే అందిస్తున్నా.. డాక్టర్ వద్దకు చేరుకోవడానికే చాలా సమయం పడుతోంది. ఇటీవల 43 మంది వైద్యులు, 26 మంది స్టాఫ్ నర్సులు బదిలీ అయ్యారు. కొత్త నియామకాలు జరగకపోవడంతో వైద్యులు, నర్సుల కొరత తీవ్రంగా ఉంది. పలు విభాగాల్లో విభాగాధిపతులు(హెచ్‌వోడీ) అందుబాటులో లేకపోవడంతో అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో, కొన్ని చోట్ల పీజీ విద్యార్థులతో ఓపీలు నడుస్తున్నాయి. కొందరు వైద్యులు సమయానికి రాకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.





ఆక్సిజన్ సిలిండర్ తీసుకెళ్తున్న రోగి.. రోగులను తరలించే స్ట్రెచర్లపై సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

పసుపు కొమ్ములతో అమ్మకు అలంకరణ



పసుపు కొమ్ముల అలంకరణతో ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో పసుపుకొమ్ములతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

-అనకాపల్లి

చందన స్వరూపునికి సంపెంగ సుగంధం

- సింహగిరి సంపెంగల విశిష్టతే వేరు...
- ఏటా జూలై, ఆగస్టు నెలల్లో విరివిగా సింహగిరి సంపెంగలు



తెల్లసంపెంగ



పసుపు, కాషాయరంగులో సంపెంగలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సంపెంగ పుష్పాలంటే ఎంతో ప్రీతి. భక్తసులభుడైన ఆయనకు ఎన్ని రకాల పుష్పాలతో పూజచేసినా...సంపెంగ పుష్పాలతో చేసిన పూజసాటి రాదంటారు. సంపెంగపూలతో పూజ చేస్తే ఆయన ఎంతగానో పరవశించిపోతాడు. సాక్షాత్తూ ఆయన వెలసిన సింహాచలం క్షేత్రంలోనే సంపెంగపూలు కూడా విరివిగా లభిస్తుంటాయి. ఎన్నిచోట్ల సంపెంగలు లభించినా సింహగిరిపైన లభించే సంపెంగకి ఎంతో విశిష్టత ఉందని అభివర్ణిస్తుంటారు.

సింహాచలం కొండపైన, కొండ దిగువన ఉన్న పూలతోటలో, దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో సంపెంగ చెట్లు ఉన్నాయి. ముఖ్యంగా తెలుపు, పసుపు రంగుల సంపెంగ పూల చెట్లు కనువిందు చేస్తుంటాయి. ఈ పుష్పాల నుంచి వెలువడే సువాసనలు ఎంత దూరంలో ఉన్నా ఆకట్టుకుంటాయి. చందన స్వరూపుడైన సింహాచలేశుడు ఏడాది పొడవునా చందనం పరిమళాలను ఆస్వాదిస్తాడు. ఆ చందనం పరిమళాలకు సమానంగా సంపెంగ పరిమళాలను మాత్రమే స్వామి ఆస్వాదిస్తుంటాడని భక్తులు పేర్కొంటారు. సంపెంగ పూలతో స్వామికి ఉన్న బంధం విడదీయరానిదిగా చెబుతారు.

శ్రీకాంత కృష్ణమాచార్యులు–సంపెంగ బంధం

తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాంత కృష్ణమాచార్యులు (కృష్ణమయ్య), తిరుమల అన్నమాచార్యుల వలె సింహాచలంలో విశేష కీర్తి ప్రతిష్టలు పొందారు. సింహాచలేశుడిపై ఆయన చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారని, ఆయన కీర్తిస్తుంటే స్వయంగా స్వామి నృత్యం చేసేవాడని చెబుతారు. కృష్ణమయ్య ప్రతిభను గుర్తించిన ఓరుగల్లు సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడు కృష్ణమయ్య దంపతులను తన రాజ్యానికి ఆహ్వానించాడు. అక్కడ రాజమర్యాదలు అందుకున్నప్పటికీ, కృష్ణమయ్య భార్యకు సంతృప్తి కలగలేదు. సింహాచలంలో స్వామిని సంపెంగ పూలతో కొలిచేదానినని, తనకు సంపెంగ పూలు తప్ప మరేమీ వద్దని ఆమె చక్రవర్తిని కోరింది. దీంతో ప్రతాపరుద్రుడు రాజభటులను సింహాచలం పంపి సంపెంగ పుష్పాలను తెప్పించాడని దివంగత నాటక రచయిత విరియాల లక్ష్మీపతి తన నాటకంలో అభివర్ణించారు.

సంపెంగల సంరక్షణ, వినియోగం

సంపెంగ పుష్పాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచడానికి కొన్ని పద్ధతులున్నాయి. గాజు సీసాలో పువ్వులు వేసి, మంచి నీటితో నింపి, గాలి చొరబడకుండా సీల్ చేస్తే చాలా ఏళ్లు తాజాగా ఉంటాయని చెబుతారు. వీటిని ఇంట్లో అలంకారంగా కూడా ఉపయోగిస్తారు. సంపెంగ పుష్పాలు ముఖ్యంగా జూలై, ఆగస్టు నెలల్లో పెద్ద మొత్తంలో లభిస్తాయి. వర్షాలు ఎక్కువగా పడితే పువ్వుల పరిమాణం కూడా పెద్దదిగా ఉంటుందని అంటారు. సింహగిరికి వచ్చే భక్తులు స్వామికి సంపెంగ పుష్పాలు సమర్పించి, ప్రసాదంగా వాటిని తీసుకునేందుకు పోటీ పడతారు. స్వామికి సమర్పించిన తర్వాత ఆ పుష్పాలను తమ శిరస్సుల్లో ధరించడానికి ఆసక్తి చూపుతారు.

ఒడిశా భక్తుడు లక్ష్మీకాంత్ నాయక్ దాస్ సేవలు

ఏటా మూడు నెలల పాటు సింహగిరిపై ఉండి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించే ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్ దాస్, ఆ కాలంలో స్వామికి పెద్ద మొత్తంలో సంపెంగ పుష్పాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయన వస్తున్నారంటే సంపెంగలు వెంట తీసుకొస్తున్నారని నానుడి ఉంది.

సంపెంగ వ్యాపారం, స్వర్ణ పుష్పార్చన

సింహగిరిపై చిరు వ్యాపారులు సంపెంగ పుష్పాలను విడిగా, దండల రూపంలో విక్రయిస్తుంటారు. డిమాండ్ ఉన్న రోజుల్లో డజను పువ్వులు అరవై రూపాయల వరకు కూడా అమ్ముడవుతాయి. ఒక దాత సింహగిరిపై లభించిన 108 సంపెంగ పుష్పాలను అమెరికా తీసుకెళ్లి బంగారంలో ముంచి స్వర్ణ సంపెంగ పుష్పాలుగా మార్చి, సుమారు ఇరవై ఏళ్ల క్రితం సింహాచలేశుడికి కానుకగా సమర్పించారు. ఆ పుష్పాలతోనే 2019 వరకు స్వామికి ప్రతి గురువారం, ఆదివారం రోజుల్లో స్వర్ణపుష్పార్చన జరిగేది. ఆ తర్వాత కొత్తగా దాతల సహకారంతో మరిన్ని స్వర్ణపుష్పాలను అందుబాటులోకి తెచ్చారు.



అంతరించిపోతున్న సంపెంగలు

ఒకప్పుడు సింహగిరి కొండల్లో వేలాదిగా సంపెంగ చెట్లు ఉండేవని, రానురాను అవి అంతరించిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. దేవస్థానం అధికారులు సంపెంగ చెట్ల పెంపకాన్ని ఎక్కువగా చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు.



రాజగోపురానికి సమీపంలోని తెల్లసంపెంగ చెట్టు

ప్రభుత్వ ఉత్తర్వులపై పునఃసమీక్షించాలి

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని పాఠశాలల ప్రాంగణాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశం నిషేధిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేయడం బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనగా భావిస్తున్నామని చైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె.ప్రవీణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను, స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులను, ముందస్తు ప్రభుత్వ అనుమతులు పొందిన వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ..., రాజకీయ పార్టీల సభ్యులను నిరాకరిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమన్నారు. అయితే ఆ ఉత్తర్వుల్లో బాలల హక్కుల సంఘాలు, ఎన్‌జీవో సంఘాల ప్రవేశంపై స్పష్టమైన సమాచారం లేకపోవడం బాలల హక్కుల ఉల్లంఘనగా భావిస్తున్నామన్నారు. విద్యార్థుల కష్టనష్టాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరాలంటే బాలల హక్కుల సంఘాలను అనుమతించాలని కోరారు. ఉత్తర్వులపై పునః సమీక్ష జరిపేలా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు లేఖలు సమర్పించామని తెలిపారు. బాలలకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

వృద్ధురాలిని రక్షించిన మెరైన్ పోలీసులు



వృద్ధురాలిని సురక్షితంగా తీసుకువెళుతున్న కానిస్టేబుల్ వెంకట్ గణేష్

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ వృద్ధురాలిని మెరైన్ పోలీసులు కాపాడారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గౌరల కళావతి ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో సముద్రంలోకి దిగుతుండగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న మెరైన్ కానిస్టేబుల్ వెంకట గణేష్ గమనించారు. వెంటనే లైఫ్‌గార్డ్ బుజ్జి సహాయంతో ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగా బాధను తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆ వృద్ధురాలు పోలీసులకు తెలిపింది. అనంతరం ఆమె వివరాలు సేకరించి ఆరిలోవ పోలీస్ స్టేషన్ బీచ్ మొబైల్ సిబ్బందికి అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వృద్ధురాలి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ వెంకట గణేష్‌ను, లైఫ్‌గార్డ్ బుజ్జిని మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

ముగ్గురు పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఇద్దరు పర్యాటకులు సముద్రంలో కొట్టుకుపోతుండగా, అప్రమత్తమైన లైఫ్‌గార్డ్స్ వారి ప్రాణాలను కాపాడారు. జార్ఖండ్‌కు చెందిన 14 మంది పర్యాటకులు ఆదివారం సాయంత్రం రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. సరదాగా గడిపి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగగా, అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వారిలో అంకుర్ కుమార్, గౌతమ్ సాహు కొట్టుకుపోయారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఎస్. నూకరాజు, ఎం. అమ్మోరు, చందు, సతీష్, గురుమూర్తి, రాజ్‌కుమార్ వీరిని గమనించి సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పర్యాటకుల ప్రాణాలను కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు. అదేవిధంగా రుషికొండ బీచ్‌లో స్నానం చేస్తుండగా విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన కోరాడ నిఖిల్ కుమార్ కూడా కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా, అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ అతన్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్య రక్ష

ప్రపంచ తల్లిపాల అవగాహన వారోత్సవ ర్యాలీలో వైద్యులు



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

మహారాణిపేట: ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్) పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ వద్ద తల్లిపాల అవగాహన ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలకు మించిన ఔషధం లేదన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాలలో బిడ్డకు తల్లిపాలు సులభంగా అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. కేజీహెచ్‌లో ఇప్పటికే బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్లు అందుబాటులో ఉన్నాయని, వీటి స్ఫూర్తితో మిగతా పని ప్రదేశాలు, పబ్లిక్ ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తే మరింత ఉపయోగకరమని సూచించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి తల్లి పాలు ప్రాముఖ్యతను వివరించారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ రెండేళ్ల వరకు పరిపూరక ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలన్నారు. ఇది శిశువును అనేక రోగాల నుంచి కాపాడడంతోపాటు, మేధస్సు వృద్ధి, మాతా శిశు బంధానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి రామలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమణ మల్లి, సింధూర, రమ్య, తాతం నాయుడు, గిరిదొరలు హాజరయ్యారు. ర్యాలీలో 200 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, 100 మందికి పైగా అంగన్‌వాడీ, ఆశా, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలో లోపం.. బిల్డర్‌కి షాక్

వినియోగదారుల కమిషన్ తీర్పు

విశాఖ లీగల్: వినియోగదారుడికి సేవలో లోపం కలిగించినందుకు గానూ ఒక బిల్డర్‌కి జరిమానా విధిస్తూ విశాఖలోని వినియోగదారుల కమిషన్–2 న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి, సభ్యులు తీర్పునిచ్చారు. కమిషన్ ఆదేశాలను అమలు చేయకపోవడంతో బిల్డర్‌పై వారెంట్ జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన రెడ్డిపల్లి లక్ష్మణరావు 2021 జూలై 3న ఎండాడలోని అశోక్ హైట్స్‌లో రూ.1.08 కోట్లు చెల్లించి ఒక ఫ్లాటును కొనుగోలు చేశారు. ఫ్లాటు విస్తీర్ణం 2,425 చదరపు అడుగులు అని బిల్డర్ తెలిపారు. అయితే ఫ్లాట్‌ను పరిశీలించిన లక్ష్మణరావు వాస్తవ విస్తీర్ణం 180 చదరపు అడుగులు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఫ్లాట్‌లోని తలుపులు, కిటికీలు, ప్రధాన హాల్ పూర్తిగా పాడైపోయి ఉన్నాయి. పార్కింగ్ స్థలం కూడా ఇవ్వలేదు. ఈ నిర్మాణ లోపాల గురించి బిల్డర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లభించలేదు. దీంతో లక్ష్మణరావు తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకున్నారు. ఆ తర్వాత సేవలో లోపం కారణంగా తాను నష్టపోయినందుకు పరిహారం కోరుతూ 2022 సెప్టెంబర్ 1న బిల్డర్‌కి లీగల్ నోటీసు పంపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తన ఫిర్యాదులో భాగంగా, నిర్మాణ లోపాలకు సంబంధించి 13 డాక్యుమెంట్లను లక్ష్మణరావు కమిషన్‌కు సమర్పించారు. దీనిపై స్పందించిన బిల్డర్.. ఫిర్యాదులో వాస్తవం లేదని, తమ నిబంధనల ప్రకారం అంతా సక్రమంగానే ఉందని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ అధ్యక్షురాలు జి.వెంకటేశ్వరి, సభ్యులు పి. విజయదుర్గ, కరకు రమణబాబులు.. లక్ష్మణరావుకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు ప్రకారం వినియోగదారుడికి నష్టపరిహారంగా రూ.లక్ష, అలాగే 180 అడుగుల పార్కింగ్ స్థలం మరమ్మతులకు 4 శాతం వడ్డీతో కలిపి రూ. 50,000, కేసు ఖర్చుల నిమిత్తం రూ.10,000 చెల్లించాలని ఆదేశించారు. ఫ్లాట్ మరమ్మతులు కూడా చేసి ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమిషన్ జారీ చేసిన వారెంట్ అమలు కోసం పెండింగ్‌లో ఉంది.

లయన్స్ క్లబ్ 316ఏ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

బీచ్‌రోడ్డు: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 316ఏ నూతన కార్యవర్గం ఆదివారం సిరిపురం బాలల ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేసింది. జిల్లా గవర్నర్ డి. సూర్యప్రకాష్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సుభాష్ బాబు, పూర్వ డైరెక్టర్ విజయ్ కుమార్ నూతన సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గాట్ ఏరియా లీడర్లు, ఆర్.సి., జెడ్.సి., టీమ్ లీడర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమానికి పాస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు సుబ్బరాజు, బి. తిరుపతిరాజు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ పి. చంద్రశేఖర్, కో–కన్వీనర్లు వి. కోటేశ్వరరావు, ఎస్.వి.ఎస్.ఎస్. ప్రసాదనాయుడు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ ట్రస్టీ ఎస్. ఉదయశంకర్ మరియు ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.132
స్కిన్	: రూ.234
స్కిన్‌లెస్	: రూ.244

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00

న్యాయ శాస్త్ర నిఘంటువు.. వడ్లమాని

నేడు విశాఖ న్యాయవాదుల సంఘంలో వడ్లమాని చిత్రపట ఆవిష్కరణ

విశాఖ లీగల్: విశాఖలో న్యాయవాదిగా 65 ఏళ్లకు పైగా సేవలు అందించిన ప్రముఖ న్యాయవాది వడ్లమాని శ్రీరామ్మూర్తికి ఘన నివాళిగా ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించేందుకు విశాఖ న్యాయవాదుల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు సంఘం నూతన భవనంలో జరగనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మద్ది నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ తెలిపారు. 1916లో ఉమ్మడి విశాఖ జిల్లా శ్రీరాంపురంలో జన్మించిన శ్రీరామ్మూర్తి.. విజయనగరం మహారాజా కళాశాలలో బీఏ పూర్తి చేశారు. అప్పట్లో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఉపకులపతి ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ చేతుల మీదుగా 3.5 తులాల బంగారు పతకాన్ని అందుకున్నారు. అనంతరం మద్రాసు న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలోనూ ప్రథమ స్థానంలో పట్టా పొందారు.



వడ్లమాని శ్రీరామ్మూర్తి

1940లో న్యాయకోవిదుడు మద్ది పట్టాభి రామిరెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. విశాఖలోనే ఉంటూ 2005 వరకు వేలాది కేసులను వాదించారు. న్యాయ శాస్త్రానికి నిఘంటువుగా నిలిచి.. న్యాయ ప్రక్రియకు సంబంధించిన ఎన్నో అంశాలను తన వాదనల ద్వారా వినిపించేవారు. ఆ రోజుల్లో శ్రీరామ్మూర్తి వాదనలు వినడానికి న్యాయమూర్తులతో పాటు ఇతర న్యాయవాదులు ఎంతో ఆసక్తి చూపేవారని, కోర్టు హాల్ మొత్తం కిటకిటలాడేదని ఆయన కుమారుడు అన్నయ్య శాస్త్రి గుర్తు చేసుకున్నారు. శ్రీరామ్మూర్తి అనేక ప్రభుత్వ శాఖలకు న్యాయ సలహాదారుడిగా పనిచేశారు. కేవలం ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా దేశంలోని పలు ప్రాంతాల నుంచి కూడా న్యాయవాదులు, న్యాయమూర్తులు ఆయన సలహాలు, సూచనల కోసం వచ్చేవారు. ఆయన వాదించిన కేసుల్లో ఆంగ్లంలో ఎటువంటి క్లిష్టమైన పదాలు వాడకుండా సరళమైన భాషను ఉపయోగించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని సీనియర్ న్యాయవాదులు వ్యాఖ్యానించారు. అలా ఆయన ఎందరో న్యాయవాదులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రపట కార్యక్రమానికి విజయవంతం చేయాలని కార్యదర్శి ఎల్.పి. నాయుడు కోరారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల చించివేత



చిరిగిన ఫ్లెక్సీలు

మల్కాపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి సర్కార్ తీరును ఎండగడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరిట 45వ వార్డు ఏకేసీ కాలనీకి వెళ్లే మార్గంలో అన్ని అనుమతులతో వార్డు కార్పొరేటర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చింపివేశారు. ఆదివారం ఉదయం చూసేసరికి ఫ్లెక్సీ చిరిగి ఉండటంతో కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదేమాదిరిగా రెండు సార్లు ఫ్లెక్సీలను చింపేశారని గుర్తు చేశారు. దీనిపై గతంలో సీఐకు ఫిర్యాదు చేశానని, ఆయన స్పందించి ఫ్లెక్సీ చింపిన వారిని గుర్తించి, హెచ్చరించారని పేర్కొన్నారు. మళ్లీ ఇపుడు అదే జరిగిందన్నారు. కారకులైన వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకుల వీరంగం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకులు దుర్భాషలాడుతూ వీరంగం చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. టౌన్‌షిప్ క్వార్టర్‌లో సీఐ కేశవరావు విశ్రాంతి తీసుకుంటుండగా అక్కడికి ఒక బైక్‌పై ముగ్గురు యువకులు వచ్చారు. క్వార్టర్ బయట ఉన్న జీపు డ్రైవర్ వద్దకు వెళ్లి సీఐ గురించి దుర్భాషలాడారు. సీఐను చంపేస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయాన్ని డ్రైవర్ టౌన్‌షిప్‌లో గస్తీ కాస్తున్న కానిస్టేబుల్ అప్పలరాజుకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతను సంఘటన స్థలానికి వచ్చి ఆ యువకులు వెళ్లిన వైపు వెళ్లారు. కొద్దిదూరంలో వారిని పట్టుకుని నిలదీశారు. వారిలో ఐ.రాజ్‌కుమార్, ఎస్.అజయ్‌కుమార్‌లు కానిస్టేబుల్‌పై కూడా దురుసుగా ప్రవర్తించి వీరంగం చేశారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారి కోసం గాలింపు చేపట్టారు.

విశాఖ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటాలి

సీపీ శంఖబ్రత బాగ్చి



మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేతలను అభినందిస్తున్న పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి

మురళీనగర్: విశాఖ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా చాటాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. మురళీనగర్‌లోని వనితా వాకర్స్ భవనంలో 'వావ్'సంస్థ ఆదివారం ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025లో పతక విజేతల అభినందన సభ ఏర్పాటు చేసింది. మలేసియా, శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2025లో 'వావ్' అథ్లెట్లు ఎం.రామారావు, కె.బి.వి.ఎం.కృష్ణ ప్రసాద్, కె.పూర్ణిమ, కె.మత్స్యకొండ స్వర్ణ, కాంస్య, రజత పతకాలను సాధించారు. వీరికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను సీపీ అందజేసి అభినందించారు. గౌరవ డాక్టరేట్ పొందిన 'వావ్' చీఫ్ ప్యాట్రన్, సామాజిక కార్యకర్త డాక్టర్ కమల్ బైద్‌ను పోలీస్ కమిషనర్ సత్కరించారు. కొత్త ట్రస్టీలు సుబోధ్ కుమార్, కపిల్ అగర్వాల్, వావ్ అధ్యక్షుడు డా.మంగ వరప్రసాద్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, కోఆర్డినేటర్ సి.హెచ్. శ్రీనివాసరాజు, పీఆర్వో వంశీ చింతలపాటి, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె. ద్వారకానాథ్, వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, వనితా వాకర్స్ అధ్యక్షురాలు పి. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎస్సీ కేటగిరీలో మిగిలిన సీట్లను ఆయా విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాలు పొందే గురుకులాలను సంప్రదించాలన్నారు.

వివాహ వేడుకకు వెళ్తూ.. మృత్యు ఒడికి..

- రైలు ఢీకొని మహిళ మృతి
- యలమంచిలి రైల్వేస్టేషన్‌లో ఘటన

యలమంచిలి రూరల్: వివాహ వేడుకకు వస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న మహిళను గుర్తు తెలియని రైలు బండి ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో యలమంచిలి రైల్వేస్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కిరెడ్డిపాలెం తుంగ్లాం ప్రాంతానికి చెందిన కొల్లి రమణమ్మ(55), మరో ముగ్గురు బంధువులతో కలిసి యలమంచిలి రాంనగర్‌లో జరుగుతున్న ఓ వివాహానికి హాజరుకావడానికి ఆదివారం రాత్రి వచ్చారు. ఆటోలో యలమంచిలి రైల్వేస్టేషన్ వరకు వచ్చి రాంనగర్‌లో జరుగుతున్న వివాహ వేదిక చిరునామా సరిగ్గా తెలియకపోవడంతో తికమక పడ్డారు. చివరకు బంధువులకు ఫోన్ చేయగా రైల్వేస్టేషన్ చివర రైలు పట్టాలు దాటితే సులభంగా వివాహ వేదిక వద్దకు చేరుకోవచ్చని చెప్పారు. దీంతో మృతురాలితో పాటు ఇద్దరు మహిళలు, మనుమరాలు రైల్వే ట్రాక్ దాటుతుండగా అదే ట్రాక్‌పై అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా వస్తోంది. వారిలో ఇద్దరు రైలుపట్టాలు దాటే సరికి రైలు వస్తున్న సంగతిని చెప్పి మిగిలిన ఇద్దరినీ రావద్దని అరిచారు. ఇద్దరిలో ఒక మహిళ రైలు పట్టాల అవతల ఉండిపోగా, కొల్లి రమణమ్మ దాటే ప్రయత్నం చేసింది. అదే సమయంలో కాలి చెప్పు జారిపోవడంతో ఆమెను రైలు ఢీకొట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



రైలు ఢీకొని మృతి చెందిన కొల్లి రమణమ్మ

ప్రమాదంలో రమణమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రెప్పపాటులో ముగ్గురు మహిళలు ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆనందంగా వివాహ వేడుకకు వచ్చిన రమణమ్మను రైలుబండి రూపంలో తమ కళ్ల ముందే మృత్యువు కబళించడంతో బంధువులు ఘటనా స్థలం వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీనిపై డ్యూటీలో ఉన్న స్టేషన్ సిబ్బంది తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మహిళ మృతి చెందిన రైల్వే ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.